


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**68**

(21 ' సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పూర్వపు రోజులే మంచివి** - "ఇప్పటికాలంలో ఏం బలం వుంది? ఏం అనుభవముంది? జీవితాలు తమాషాగా గడవడమేగాని" అన్నాడు మొన్న ఒక ముసలాయన మాట్లాడుతూ ఆయనగారి కంటే పది పదిహేను సంవత్సరాలు తక్కువ వయస్సులో వున్న మరో ఆయన వెంటనే అందుకుని "తమాషాగా గడపడమంటారేమిటండి.. భలే హుషారుగా గడిచిపోతోంది. అసలు ప్రొద్దెలా కూకుతోందో తెలియడం లేదు ఎలా తెల్లారుతోందో అంతకన్నా తెలియలేదు. భలే కాలం. బ్రతకవలసిన కాలం. నా మటుకు నేనెంతో గర్విస్తున్నాను" అన్నాడు - అంతులేని ఉత్సాహంతో అంచులు తాకిన ఉద్రేకంతో.

<u>*పరగడుపుతో పరగణా అంతా షికారు.*</u>

"ఏం ఉషారయ్యా. ఉషారూ! మాటల్లో చెప్పుకుంటే అయిందేమిటి? బ్రతుకులో వుండాలి మజా! పూర్వకాలం వాళ్ళల్లో ఎంత బలం వుండేది. పరగడుపున లేచి పచ్చి మంచినీళ్ళన్నా త్రాగకుండా రివ్వున తిరుగుతూ ఒక పరగణా అంతా పాలించి చక్కా వచ్చేవారు. ఉస్సో, అనే వారా, అస్సో అనేవారా!. ఇప్పటి వాళ్ళను కాఫీ త్రాకకుండా ఫర్లాంగు నడవమను తెలుస్తుంది - అసలు పక్కమీదనుంచి లేవమనండి చూద్దాం. ముగ్గురు కలిసి రెక్క పట్టుకోవాలి." అన్నాడాయన.

"లేవలేక కాదయ్యా మహానుభావా! ఈ యుగంలో వాళ్ళకు అసలు రాత్రి పగళ్ళ వ్యత్యాసం ఎక్కువ లేదు. అవసరమైతే అహోరాత్రాలూ మేలుకుంటారు. పూర్వకాలంలో ఒక్క జారులూ, చోరులూ మాత్రమే మేలుకో కలిగేవారట. ఇప్పుడు సగం మంది జనాభా మేలుకునే వుంటున్నారు. లేకపోతే రైళ్ళు, విమానాలు, ఫ్యాక్టరీలు, క్లబ్బులు, సినిమాలు, హోటళ్ళు - ఇవన్నీ నిరంతరం ఎలా పనిచెయ్యకలుగుతున్నాయి?"

"ప్రొద్దుటపూట కొంచెం ఆలస్యంగా లేచినందుకు ఆక్షేపించక్కరలేదండీ. కావాలంటే గంతేసి లేవగలం. ఎంత దూరమైనా వెళ్ళగలం. కానీ సరి అయిన కారణం వుండాలి. తెల్లవారు ఝామున రైలు దగ్గిరి మిత్రుణ్ణి కలుసుకోవాలనుకోండి. ఎగిరి అక్కడ పడగలం అవసరమైతే షేవ్ చేసుకుని, సూటు వేసుకుని, -"

<u>*ఎనిమిదింటిదాకా మధుర స్వప్నాలు కనడం*</u>

"అంతేగాని అనవసరంగా పరుగెత్తడాలు, అక్కరలేని వాళ్ళను కలుసుకోవడాలు, కడుపులో ఆకలి మాట ఆలోచించకుండా, రోడ్లన్నీ కదను త్రొక్కిరావడాలు - ఇవన్నీ ఈ కాలానికి సంబంధించినవి కావు. మధుర స్వప్నాలు కంటూ ఎనిమిదింటిదాకా నిద్రపోవడం - మనస్సును సరిచేసుకుని లేచి - ఇంత త్రాగి, ఇంత తిని చింతలేని జీవితం గడపడం వింతలలో కొన్ని గురించి ఆలోచిస్తూ, సినిమా పాటలు వింటూ, దేవతలలాగా కాలం గడిపే అవకాశం ఈ కాలం వారికి వుంది.

"దీన్ని దేవతాంశ క్రింద జమకట్టవచ్చు. పాతకాలాన్ని గురించి ఏదో చెపుతావెందుకు. ఒక్క విషయం ఆలోచించు. పూర్వకాలంలో వారికి "ఇంత ఫ్రెష్ గడ్డాలుండేవా? భీకర ఆకారాలు. ప్రతివాడికి ఒక మూరెను పిచ్చుక గూడంత గడ్డం. అసభ్యం.. అసభ్యం" అని కేకలు పెట్టాడాయన.

మొదటగా సంభాషణ ప్రారంభించిన పెద్దమనిషి తన వాదాన్ని పొడిగించాలని ప్రయత్నించడు. కానీ రెండవ వ్యక్తి ధాటి ఎక్కువగా వుంది. పైగా ఆయన చెప్పే మాటల్లో ఎదిరించడానికి ఎంత మాత్రం అవకాశం కల్పించడంలా.

కాలం మారింది. పరిస్థితులు మారుతున్నాయి. రెండెడ్ల బండి యుగం నుంచి జంబూ విమానాల యుగం వచ్చింది. ఏ కుర్రాణ్ణి పలకరించినా 'నేను కొంచెం పెద్దవాణ్ణయిన తర్వాత "ఇంఫాలా" కారు కొంటా చూడండి. ఇంట్లో వాళ్ళందర్ని ఎక్కించుకుని తిప్పుతా.' అని సగర్వంగా చెపుతున్నాడు. ఉత్సాహం అంత గొప్పగా వుంటుంది. అది కాలంలోగల బలం అనడంలో తప్పేం వుంది.

కాలం చేసేపని కొత్తదనాన్ని తీసుకురావడమే. ధర్మాలు పాతవి వున్నా మర్మాలు మారక తప్పదు. మనస్సులు ఒకటిగా వున్నా మంతనాలు మారడంలోనే అందం వుంది. ఈ యుగంలో 'మనస్సుకు' ఎక్కువ ప్రాధాన్యం వచ్చింది. కొన్ని మంచి మనస్సులు చేరి మతాన్ని కల్పించుకుంటున్నాయి - ఈ కాలంలో వితరణ స్వరూపాలు కూడా మారిపోతున్నాయి - ఏది మారినా, మతం మంగళప్రదంగా వుండాలి. ఇలాంటి నిర్వచనాలు కూడా చాలా వినవస్తున్నాయి. వింటున్నాం. వీటికి తగిన స్వప్నాలు కంటున్నాం.

*"నా కంటితో చూసిందే నే నమ్ముతా"*

"నా కంటితో చూసిందే నమ్ముతాను. తక్కిన వాటిమీద నాకు నమ్మకం లేదు. నమ్మకపోతే వచ్చే నష్టం లేదు" అన్నది మొన్న ఒక కంబందళాయతాక్షి -

"విన్నవాటిని నమ్మవన్నమాట. అయితే నీకు చాలా తీరిక లభిస్తుంది జీవితంలో - అసలు మనస్సు చాలా స్వచ్ఛంగా వుంటుంది" అన్నాను.

"అవునండీ అనవసర విషయాలన్నీ నమ్మి మనస్సు "లంబర్ రూమ్" చేసుకోవడం నాకిష్టంలేదు. దాన్ని క్లీన్‌గా "డ్రాయింగ్ రూమ్"లాగా వుంచుకోవడమే నా అభిలాష - వెనుకటి వన్నీ నమ్మడమేమిటి? " అన్నదామె.

"పోనీ నిన్నేమీ బాధపెట్టని వెనుకటి సత్యాలనన్నా అంగీకరిస్తారా!. అవికూడా అక్కరలేదంటారా?" అన్నాను.

"ఎందుకొచ్చిన గొడవండి - వాటిని అంగీకరించడంవల్ల వచ్చే లాభమేమిటి? ముందు కాలాన్ని గురించి ఆలోచించవలసిన అవసరమెంతైనా వుంది"

*నిన్న మొన్నలు లేవు నేటికి నేడే జీవితం*

"అసలు నా వుద్దేశ్యంలో నిన్న మొన్నలు అనే వాటిని - తొలగించి వేయాలని వుంది. ఎందుకొచ్చిన రభస. హాయిగా వుండక" అన్నది.

ఇది కూడా గొప్ప వేదాంతమే. వెనకటి విషయాలు తలుచుకోవడం వల్ల వేదన తప్ప మరొకటి కనిపించదు. తలచుకుని మాత్రం వాటన్నిటినీ సర్దుకు రాగలమా? సర్వం సుందరంగా తయారు చేశామనే గర్వం ప్రకటించగలమా! ఒక పెద్ద మనిషి చాలాకాలం క్రింద ఇలాంటి వేదాంతమే అవలంభించాడు.

"పాత నాకు అక్కర్లేదు. నిజానికి వెనకటి విషయాలు నాకేం జ్ఞాపకం వుండవు. వాటిని గురించి ఎవరూ ప్రస్తావించకండి. ప్రస్తుతాన్ని గురించి ముచ్చటించండి. మురుస్తూ మాట్లాడుకుందాం" అనేవాడు.

అది విన్నవాళ్ళు "సరే ఆయన ఇష్టం ఆయనది. మనమేం చేస్తాం" అని వూరుకున్నారు. కానీ ఆయనకు అప్పు పెట్టినవాళ్ళు - అందులో చేబదుళ్ళు ఇచ్చినవాళ్ళు చెప్పలేనంత గాభరాపడ్డారు - "అన్నీ మరిచిపోతే పోయారు. మా అప్పు సంగతి మాత్రం జ్ఞాపకం వుంచుకోండి. మీకు పుణ్యం వుంటుంది" అని బ్రతిమాలారు. కానీ ఆయనగారు తన పట్టుదల వదలలేదు - ఒక్క పద్దు జమ కట్టలేదు.

*<u>నిత్యసమస్యలు గుండెల్లో సరిగమలు</u>*

మొత్తానికి పైన చెప్పిన ఆమె పద్ధతి బాగానే వుండేట్లుంది. వెనుకటికి తలుచుకోవడం కాలం వృధా చేసుకోవడం తప్ప, వచ్చేదేమీ వుండటంలేదు. ఈరోజు చాకిరీకి ఈరోజే సరిపోవడం లేదు. ఇంకా తీరికగా కూర్చుని త్రేపుతూ వెనకటి విషయాలు జ్ఞాపకం చేసుకోవడానికీ, అవసరాన్ని బట్టి చింతంచడానికి, లేదా సంతోషించడానికి తీరిక ఎక్కడిది?

ఏరోజు సమస్యలు ఆ రోజే గుండెల్లో సరిగమలు వాయిస్తున్నాయి. ఆ స్వరంలో కంఠం కలవక గగ్గోలు పడుతున్నాం. అపశృతితోనే సూర్యభగవానుడు అస్తమిస్తున్నాడు.

●●●

Post your comments